# భగవాన్
# శ్రీ రమణమహర్షి వాణిముత్యాలు

# Ramana Maharshi Vani Mutyalu

Author :

Jayanthi Chakravarthi

# భగవాన్

# శ్రీ రమణమహర్షి వాణిముత్యాలు

- "జనన మరణాలు, భూత, భవిష్యత్, వర్తమానాలు అనే విభజన మనం చేసుకున్నవే. కాలం అఖండం!
- నీవు – నేను అన్న ద్వైతం, మనం అనుకుంటున్నదే!
- అపరిణామము, కాలాద్యవిచ్ఛిన్నమైన సత్యమే శాశ్వతం. అది మార్చదగనిది.
- బంధము, బంధన, ముక్తి దేహానికే గాని ఆత్మకు లేవు.
- అభ్యాసం ఒక నిరంతర ప్రక్రియ.
- వైరాగ్యం ఒక అంతరంగ భావన.
- ఇవన్నీ సహజస్థితులే.
- ప్రపంచమంతా పరమాత్మ రూపమే.
- నీవు విస్తృతమౌతున్నకొద్దీ పరిపూర్ణత అనుభవంలోకి వస్తుంది.
- దేహమే "అసలునీవు" కానపుడు, నీవు కర్తవూ కాదు. నీకు కర్తృత్వమూ లేదు. జరుగుతున్న అనేక విషయాలలో నీ ప్రమేయం నిజానికి శూన్యం. ఉన్నదంతా అనుకోవటంలోనే వున్నది. ఇటువంటి భావనే కర్మయోగం. కర్మలన్నిటికీ నీవు కర్తవు కాదు. కర్మలు జరుగుతూనే వుంటాయి.
- నీ సాధనతోనే సమాధానం పొందాలి.
- మనసు నియంత్రించుకోవటం, ఆలోచనలను క్రమబద్ధీకరించుకోవటం, అభ్యాసం! నిరంతరాభ్యాసం భౌతికవస్తువుల పరిమితిని తెలియచెప్పి, అవి అందించే సుఖసంతోషాలు తాత్కాలికమని బోధిస్తుంది. ఒక అనుభవాన్ని కలిగిస్తుంది. అది వివేకాన్ని ప్రసాదిస్తుంది. దాంతో వైరాగ్యం లభిస్తుంది. ఇకపై మిగిలినదంతా శాంతే. శాంతి లోపలే వున్నదని, ఎవరో యిచ్చేది కాదని, మనంతట మనమే పొందాలని అనుభవమౌతుంది.
- నువ్వున్నావన్న వాస్తవమే, దైవమున్నాడనటానికి తిరుగులేని సాక్ష్యం.
- పరమాత్మ ప్రకాశాన్ని కంటితో దర్శించలేకపోవటానికి కారణం, కన్ను భౌతికస్థాయిలో ఉండటమే. అది పనిచేయటానికి మూలమైన కారణాన్ని, వస్తువును,

శక్తిని తెలుసుకోగలిగితే, ఆ శక్తే "ఆత్మ" అని తెలుస్తుంది. మూడో కన్ను అంటే ఆత్మే! తాను చూడటానికి తనకంటే భిన్నమైన వస్తువేదీ ప్రత్యేకంగా లేదు కనుక, ఆత్మకు చూడటం అంటూ లేదు. ఉండటమే! అదీ సాక్షిగా.

- "నేను చేస్తున్నాను" అనే కర్తృత్వభావం ఉన్నంతకాలం, అది కర్మే !
- ఆభావం నశించి కర్మలు జరుగుతుంటే అదే కర్మయోగం.
- భగవంతునిపట్ల ఉండే తీవ్ర ఆవేశము, ఉద్విగ్నము, తాదాత్మ్యము కలిస్తే అది భక్తి. నిర్మలము, నిశ్చలము, అరుణము, నికామము కలిగిన భక్తిభావమే భక్తియోగం.
- అహం నశించి, మనసు హృదయంలో లీనమై, ఆత్మవిచారంలో నిలకడ చెందితే అది జ్ఞానయోగం.
- నీలో నీవు వుంటేనే, నీవు ధ్యానివి !
- నీతో నీవు వుంటేనే, నీవు యోగివి!
- వాస్తవంలో జీవించమని, వాస్తవాన్ని గ్రహించమని, ఆత్మే వాస్తవమని భగవద్గీత బోధిస్తుంది.
- అనుభవజ్ఞానమే అసలు విద్య.
- అనుభవమే గురువు.
- అనుభవమే ఆత్మ.
- సర్వప్రాణుల హృదయాలలో ఉన్న "నేను" ఆత్మే!
- గాఢ నిద్రలోను, తీవ్ర ధ్యానంలోను అసలు నేను ఉంటుంది. అసలు నేను అంటే ఆత్మే. ఆ స్పృహే ఎరుక.
- ఎరుక లేనివాడు బయటి ప్రపంచాన్నీ అది అందించే అనేక అనుభవాలకు, సవాళ్ళకు ప్రతిస్పందిస్తూ కాలాన్ని వెళ్ళదీస్తుంటాడు. మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం, అజ్ఞానం ఆధారంగా ప్రతి విషయాన్నీ తీవ్రంగా ప్రతిఘటిస్తూ నిరంతర ఘర్షణకు లోనవుతాడు. ప్రపంచంతో ఉన్న సంబంధమంతా ఇంద్రియాలకు లోబడే ఉంటుంది. అనుక్షణమూ మార్పు చెందే సర్వ ప్రపంచాన్ని వాస్తవంగా భావించి దానియందు మమకారాన్ని పెంచుకుంటాడు.

- మానవుడు అతిశయంతో, ప్రపంచంతో పోటీ పడి దానిపై ఆధిపత్యం కోసం ఆరాటపడతాడు. పోరాటం చేస్తాడు. ఆ ప్రయత్నంలో విజయం సాధించలేకపోయినపుడు విషాదాన్ని అనుభవిస్తాడు. నిజానికి ఇదంతా ఒక వృధా ప్రయాసే.
- ఇటువంటి పరిస్థితులలో జ్ఞాని ఎలా ఉంటాడు? జ్ఞాని సాక్షిగా ఉంటాడు! ఆత్మవలె నిశ్చలంగా ఉంటాడు. ఆ స్థితి సర్వానందమయం.
- "నేనుగా" మేనుతో ఉన్నా, "అసలునేనుగా" ఉంటాడు. ఉన్నదంతా విభూతి స్థితే. జాగ్రత్, స్వప్న, సుషుప్తి, అవస్థలను దాటి వాటికి అతీతంగా ఆత్మవలె ఉంటాడు. దేహం జడం, ఇంద్రియాలు జడం, ప్రాణంగా పిలవబడే వాయువు, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ అనబడే పంచకోశాలు, మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము... ఇవన్నీ జడమే. అవిద్య, అజ్ఞానం కూడా జడమే. అన్నీ నీడలవంటివే. ఇవన్నీ కానిదే "సత్". అది చైతన్యవిలసితం, అదే ఆత్మ. ఏది నిత్యమో, సత్యమో, శాశ్వతమో అది మాత్రమే ఆత్మ. మిగిలినవన్నీ అనాత్మే. ఈ స్పృహ కలగటం కోసం తీవ్రసాధన చేయాలి.
- ఏది అన్ని కాలాలలో ఉన్నదో దానిని వెదకవలసిన పని లేదు. అది కనబడుతూనే ఉన్నది. చేయవలసిందల్లా ఆత్మను అనుభవంలోకి తెచ్చుకోవటమే. ఏ దేహాన్ని నిత్యసత్యంగా భావిస్తున్నామో అది నిజం కాదని ఎరగటమే ఎరుక.
- జీవుడు, ఈశ్వరుడు నిజానికి రెండూ ఒకటే. ఉన్న తేడా అంతా నామ, రూప తత్వాలలోనే. మనసుతో చూచినంత కాలం ఇదే భావముంటుంది. తన నిజరూపాన్ని అనుభవించాలన్న అన్వేషణలో చివరకు భేదం లేదని గ్రహించి స్థిమితం కలుగుతుంది.
- వ్యక్తి ఒకడే. అతడే ఒకరికి తండ్రి, మరొకరికి కొడుకు, అల్లుడు, స్నేహితుడు, యజమాని, భర్త...
- ఒక నటుడు ఒక పాత్రను పోషించే సమయంలో ఆ పాత్రే తానుగా వెలిగిపోతాడు. రంగు తుడుచుకుని, వేషం తీసివేయగానే తన సహజస్థితిలో ఉంటాడు. ఉన్న తేడా అంతా వేషంలోనే.

- జీవుడు కూడా తన స్థితిని స్పష్టంగా ఎరిగి, తన స్వస్వరూపాన్ని తెలుసుకోగలిగితే తన అసలు స్థితి దైవమే అన్న భావనలో స్థిరపడతాడు. అప్పుడు జీవుడు, జగత్తు, జగదీశ్వరుడు ఒకటే అనే అద్వైతస్థితిని పొంది, ఆనందస్వరూపుడై ఉంటాడు. అదే ఆత్మనిష్ఠ. ఉద్వేగమెరుగని నిజస్థితి, సహజస్థితి అది. ద్వంద్వాలు లేని ఏకస్థితి. శూన్యపూర్ణ స్థితులు ఏకమైన స్థితి. జ్ఞానాజ్ఞానాలు అంటూ ఏమీ లేని స్థితి. కానీ, అన్నీ ఉన్న స్థితి. నిరంతరానందం శాశ్వతంగా నిలకడ చెందిన స్థితి అదే ఎరుక అంటే.
- ఏకాంతంలో సమూహాన్ని, సమూహంలో ఏకాంతాన్ని అనుభవించగలిగితే అది ఆత్మనిష్ఠ. అహం అంతమైన వేళ, ఆత్మను ఎరిగి ఉండటమే అసలు తపస్సు. చీకటి లేదు అంటే ఉన్నది వెలుగే అని అర్థం.
- హృదయము చైతన్యస్థానము. అదే సత్.
- మరణమంటే మార్పే.
- చైతన్యస్థానంలో సంస్థితమై, మృత్యుంజయుని శరణు కోరినంతనే, అహంకారం నశించి, మానవుడు అమృతస్థితిలో జీవిస్తాడు. చేయవలసిన ప్రార్థన–అభ్యర్థన యివే!
- జగత్తుగా వెలుగుతున్న ఈ దృశ్యంలో చూపు, చూచేవాడు, చూడబడేది ఒకటే.
- స్థూల, సూక్ష్మ శరీరాలు నశింపక తప్పదని 'ఎరుక' కలిగినపుడు, ఆత్మ నిత్యమన్న 'జ్ఞానం' కలుగుతుంది.
- మనసును దాటగలిగితే, చూపూ లేదు, చూచేవాడూ లేడు. వస్తువే లేనపుడు దుఃఖమూ లేదు. అదే సచ్చిదానందం.
- పంచేంద్రియాలతో నామరూప సహితమైన స్థూల ప్రపంచం చూస్తాం. అది అర్థసత్యం.
- సమాధిలో చూచేది నామరూప రహితమైన 'ఆత్మ'. ఇది పూర్ణ సత్యం.
- మనస్సులేని శరీరం జడం. శరీరం లేకపోతే ప్రపంచం అనూహ్యం. మనసంటే, శుద్ధ చైతన్య పారావారంలో తారాడు, పారాడు, పోరాడు అలల సమూహం. ఇందులో అన్నీ పరస్పరాశ్రయాలు. వీటన్నింటికీ ఆధారం సత్య మొక్కటే.
- ఆలోచనలు కదిలితేనే ప్రపంచం. ఆలోచనలు వదిలిపోతే, మనస్సు తన స్వస్థానమైన చైతన్యంతో కలిసి వుంటుంది.

- మనసే ఈ జగత్తును చూపిస్తుంది. ఆ మనసే ఆత్మతో కలియగానే, జగత్తును మూస్తుంది.
- పూజలు, జపాలు ఆలోచనలను నియమబద్ధం చేస్తాయి. ఆత్మసాక్షాత్కారంవైపు ఆలోచననను మళ్ళిస్తాయి. కాని 'ఎరుక'ను ప్రసాదించవు.
- అవస్థాత్రయమే జీవిత గమనం. కర్త, కర్మ, క్రియ అనే త్రిపుటియే జీవన విధానం. అవస్థలు దాటే, త్రిపుటిని దాటిన స్థితే, స్వస్వరూప జ్ఞానం. జీవనఖేలను దైవలీలగా భావించటం ఈ స్థితిలోనే.
- చీకటి వెలుగుల వలె, జ్ఞానాజ్ఞానాలు సహజీవనం చేస్తాయి. వీటిని అధిగమించటమే స్వస్వరూపజ్ఞానం.
- 'ఆత్మ' మన అహంకారంగా, మనస్సుగా, బుద్ధిగా, శరీరంగా మన వెలుపల ప్రకాశిస్తున్నది.
- జాగ్రదవస్థలో ఆత్మ సాక్షాత్కారం దుర్లభం. కానీ ఆ అవస్థలోనే జీవన్ముక్తికి మార్గం గోచరిస్తుంది.
- జ్ఞాన సాధన, సంఘసేవను ఆధ్యాత్మయోగంగా మారుస్తుంది. సేవ నుండి ప్రేమ, ప్రేమ నుండి సేవ ఉత్పన్నమౌతాయి.
- శరీరమే 'నేను' అనుకున్నపుడే, 'నీవు' 'అది' అనే భావాలు ఏర్పడుతున్నాయి. ఆత్మను 'నేను'గా భావించినపుడు 'నీవు' 'అది' మటుమాయమవుతాయి.
- వర్తమాన కాలమే సత్యం. భూతకాలం, భవిష్యత్ అన్నవి వర్తమానానికి రూపాంతరాలే.
- శరీరం కాలానికి లొంగి వుంటుంది. ఆత్మ కాలాన్ని లొంగదీసుకొని వుంటుంది.
- జ్ఞాని, ఆత్మను 'నిత్యం'గా అనుభవిస్తాడు. అజ్ఞాని, శరీరాన్ని 'నిత్యం' అనుకుని, ఆదమరుస్తాడు.
- జ్ఞాని, సర్వమూ తానేనని విశ్వాత్మ భావంలో వుంటాడు. అజ్ఞాని, తానే సర్వమని భ్రమిస్తాడు.
- ప్రారబ్ధం, మానవ ప్రయత్నం మనసుకు సంబంధించినవి. మూలం తెలిసినపుడు, సమూలంగా సచ్చిదానందం లభిస్తుంది.

♦ ఆత్మ సాక్షాత్కారమే ముందు. తరువాతే దైవదర్శనం.

♦ ఆత్మ దర్శనం అంటే మనసును వదిలిపెట్టడమే.

♦ అంతఃకరణను వెలిగిస్తూ ఆత్మ వెలుగుమూలమై వున్నది. అంతఃకరణను దాటి, మనసు ఆత్మలో కలిసినపుడే ఆలోచనలు అణిగి ఆత్మానుభవం కలుగుతుంది.

♦ నిద్రావస్థలో అణగివున్న 'నేను' నిద్ర లేవగానే 'నేను' అంటున్నది. అవస్థలకతీతమైన 'అసలు నేను' ఏమీ అనటం లేదు. అది అంతటా వున్నది.

♦ శరీరానికి ఎరుక లేదు – పుట్టుక వున్నది.
ఆత్మకు ఎరుక వున్నది – పుట్టుక లేదు.
ఈ రెండింటి మధ్య వున్నదే చిజ్జడ గ్రంధి.

♦ అహంకారమను 'నేను' నీడ వంటిది. అహం స్ఫురణ ఆత్మలో లీనమైనపుడే, నీడ మాయమౌతుంది.

♦ అహంకారాన్ని జయించటమంటే, ప్రపంచాన్ని అన్నివేళలా జయిస్తున్నట్లే.

♦ అవస్థలన్నీ ఆత్మ విలాసాలే! ఈ స్ఫురణే జీవన్ముక్త స్థితి.

♦ ఆత్మకు ఆలోచన లేదు – మనసు అంటే ఆలోచనే!

♦ మనసు మౌనం వహిస్తే, తన మూలం తాను తెలిస్తే, అదే ఆత్మజ్ఞానం.

♦ నేను, నేను, నేను అంటూ అన్వేషణ ప్రారంభించి, అసలు 'నేను'ను హృదయగుహలో కలిసినపుడే 'అహం' నశిస్తుంది. పూర్ణమైన విశ్వంభర గోచరిస్తుంది.

♦ ఆదిత్యకాంతి ఆదిత్యుడైనట్లు, చంద్రకిరణాలు చంద్రుడైనట్లు, మనసు, ఉనికి, అహం, ఆత్మగా వెలుగుతున్నాయి.

♦ 'నేను ఆత్మనెలా అవుతానని' అన్నప్పటి నీ జీవభావము సైతం ఆత్మ విలాసమే. తెలుసుకునేవరకే ఆట. తెలుసుకున్న మరుక్షణం ఆట నీలో ఆగిపోతుంది.

♦ తెలుసుకుంటున్నదీ – తెలియబడినదీ రెండూ ఒకటే.
తెలియనంతవరకు – మాయ.
తెలియగానే – చైతన్యం!

♦ వాదనలన్నీ కాలయాపనలే ! అభ్యాసయోగమే అసలు పని!

- నిద్రలో కలిగిన బాధలకు, నిద్ర నించి బయటకు వచ్చాక విచారించనట్లే, ఆత్మానుభవం తర్వాత ప్రపంచం పట్ల మన భావనలన్నీ నిర్వికారంగా వుంటాయ్.
- జడసమాధి వాసనామయం. సహజ సమాధి అంటే ఆత్మగా వుండటమే. ఈ స్థితిలో 'సోహం' కూడా లయమై వుంటుంది.
- అసలు ఉన్నదంతా అద్వైతమే. ద్వైతంలో వుండి చివరకు అద్వైతం కనుక్కున్నట్లుగా వుంటున్నది.
- కర్తృత్వ భావంలో, కర్మఫలం అనుభవించక తప్పదు. ఆత్మ చేసే కర్మలకు, బంధన లేదు. అంతా ముక్తే.
- 'బంధం' అన్న ఆలోచనలోనే 'మోక్షం' అన్న భావం వుంది. బంధం శరీరానికే గాని ఆత్మకు లేదు. ఆ కారణంగా, ఆత్మకు ఉన్నదంతా మోక్షమే. ఆత్మే మోక్షం.
- 'అహం' నశించటమే పూర్ణమైన ముక్తి. 'వెన్నెల చూస్తున్నాను' అంటే ద్వైతం. వెన్నెలే నేను' అంటే అద్వైతం. 'అంతా వెన్నెలే' అనటమే అసలు విముక్తి.
- బహిర్ముఖమైన మనసు, సాధన ద్వారా, స్పృహతో తమ స్వస్థానమైన హృదయంలో లయమయే స్థితే సమాధి. లయం కావటమంటే నిశ్చింతగా ఉండటం. ఆ స్థితి ఏర్పడినప్పుడు సంకల్పాలంటూ ఉండవు. కానీ మనసు పూర్ణంగా లయం కానందున తన ఉనికిని కోల్పోదు. అంటే మనోహృదయాలు పూర్తిగా ఏకం కాని కారణంగా ఆ స్థితి నిర్వికల్పమౌతుందేమో కానీ, తిరిగి ప్రయత్నించటం ప్రారంభం కాగానే యథాపూర్వస్థితిని పొందుతుంది. యోగంలో ఇది ఒక భాగమే. అందరూ పొందే తాత్కాలిక స్థితే ఇది. కావలసింది, పొందవలసింది సహజ సమాధి !
- ఎవరి మనసు, తన మూలమైన హృదయంతో లయమై నిలకడచెంది, రాకపోకలెరుగని నిరామయ స్థితిని పొంది, కదలిక, మెదలిక ఎరుగనిస్థితిలో ఉంటుందో, అదే సహజ సమాధి. ఇది కానిదంతా క్రియా యోగమే. అంటే ప్రయత్నపూర్వకంగా సాగి, ఆగినట్లున్న స్థితే, క్రియలేని నిశ్చలస్థితే సహజ సమాధి.
- ఎరుక లేకుండా మనసు హృదయంలో లయమైనపుడు ఏర్పడేది, నిద్ర !
- ఎరుక కలిగి, మనోలయం జరిగినపుడున్న జాగ్రదవస్థే సమాధి. ఈ స్థితిలో మనసుకు చలనం ఉండదు. ప్రాణస్పందనలు మంద్రస్థాయిలో ఉంటాయ్. దేహాత్మభావం ఉండదు. దేనిని పట్టించుకోని స్థితి ఉంటుంది.

- మనసు, దాని కార్యకలాపాలు, కర్మ వలన కలిగే అనుభవం, ఆనందం... ఇదంతా భావ పారవశ్యమే. వీటన్నింటిని దాటి, సర్వేంద్రియాలు తమ తమ కార్యకలాపాలను వదిలి, శూన్యవృత్తులతో మనసు నిశ్చల, నిర్మల స్థితిలో నికడచెంది ఉండటం, అందునా జాగ్రదవస్థలో! ఇదే సహజ సమాధి.
- హృదయంలో పూర్తిగా లయమైనందున మనసు ఆలోచనారాహిత్యాన్ని పొంది, అంటే ఉనికిని కోల్పోయి, అన్నటికీ మూలమైన ఆత్మస్పర్శను పొదటం ప్రారంభిస్తుంది. అంటే మనోవృత్తులు నశించి, సద్వృత్తులు సన్నగా తమ ఉనికిని చాటుతుంటయ్. అంటే మనసు లేదు కనుక అహంకారం లేదు. అందువలన అహమూ లేదు. అహంస్ఫురణ కారణంగా సర్వమూ అధీనమైన స్థితి, జాగ్రదవస్థలో సహజస్థితిగా ఏర్పడుతుంది. అదే సహజ సమాధి.
- మనసున్నంత వరకూ అహంకారం తప్పదు.
- అహంకారమున్నంత వరకు భయం, బాధ, దుఃఖం తప్పవు. ఇదొక విషవలయం. అన్నివేళలా ఆగకుండా పరిభ్రమించే చక్రం.
- జ్ఞానికి అనేకం అంటూ లేదు. ఉన్నదంతా ఒకటే. అదే ఆత్మ. ఇదే సత్యం. అహంకారాన్ని గమనించి స్వీయసాధనలో దాన్ని దూరం చేసుకోవటం వలన అన్నీ పోయి ఆత్మ ఒక్కటీ మిగులుతుంది. ఆపై జరిగేదంతా ఆత్మసంబంధమే.
- అనుకోవలసింది ఒకటే, నేను ఆత్మను అని!
- ఆ అనుకోవటం ఆపగానే, ఆ నేనూ నశించి, ఆత్మ స్థిరమౌతుంది. కర్తృత్వం నశిస్తుంది. కనుక బంధనా ఉండదు. ఆ కారణంగా పొందటమూ ఉండదు. పోగొట్టుకోవటమూ ఉండదు. ఇదే నిరామయ స్థితి.
- ఇదంతా నిద్రావస్థలోనో, సుషుప్తిలోనో జరగటం లేదు. జాగ్రదవస్థలో సాక్షీభూతస్థితిలో ఉండిపోవటమే సహజసమాధి స్థితి.
- నిర్వికల్ప సమాధి వరకు వచ్చిన సాధకుడు, క్రియను సైతం వదలిపెడుతూ చేరుకోవలసిన గమ్యమే సహజ సమాధి.
- నిరంతర యత్నమూ, లక్ష్యశుద్ధి ఉన్నప్పుడు సహజ సమాధి సులభంగానే లభిస్తుంది. కావలసింది ఎరుక, ఆత్మ నిష్ఠ. సచ్చిదానంద యోగం.

- సహజ సమాధే అసలైన అచల స్థితి. అందుకోవలసిన స్థితి.
- "కర్త, జీవుల ప్రారబ్ధాన్ని అనుసరించి వారిని నడిపిస్తాడు. ఎంత ప్రయత్నించినా జరగకూడనిది జరగదు. ఎంత నిరోధించినా జరగవలసినది జరగక మానదు. ఇదే సత్యం, కనుక మౌనం వహించటమే ఉత్తమం."
- "నేను" ఎవరన్న నిరంతర విచారణతో, శరీరమే నేనన్న ఆలోచన సమసి, మనసు మలగి, అసలు నేను అనుభవంలోకి వస్తుంది.
- "అసలు నేనే" ఆత్మ.
- నేను అన్నది ప్రణవం కంటే పురాతనం. అదే ఇది. ఈ మహాపరి సత్యాన్ని తెలుసుకోవటానికి విద్వత్తు, పాండిత్యం, శాస్త్రజ్ఞానం అక్కరలేదు. ఎందుకంటే అవన్నీ ఆత్మవైపు నడిపించేవే కాని, అవి ఆత్మ కావు.
- హృదయమంటే శరీరంలో కుడిరొమ్మున ఉన్న గుహ, అదే శక్తి స్థానం, సహస్రారాన్ని కలిపే అమృతనాడి ప్రారంభమయ్యేది అక్కడే. కనుక శక్తిస్థానం మీద ధ్యానిస్తే, ఎరుక స్పష్టమవుతుంది. ఈ విచారణలో మనసే ఆయుధం. ముల్లును ముల్లుతో తీయటం వంటిదే ఈ విచారణ. మిగతా ధ్యానప్రక్రియలన్నీ మనసు మూలాన్ని పట్టుకొనే ప్రయత్నాలే. విచారణ మార్గం, మనసు ఆధారంగా అసలును తెలుసుకోవటమే.
- జ్ఞానాజ్ఞానాలు సృష్టినంతటా పరుచుకొనే ఉన్నాయి. వాటి స్థితులను ఎరిగి చివరకు జ్ఞానిగా నిలకడ చెందటమే ఇక్కడ సాగే ఆట. అదే జీవితం.
- సూర్యుడికి చీకటితో పరిచయం లేదు.
- చీకటికి వెలుగేమిటో తెలియదు. పరస్పరం తెలియకపోయినా అవి ఉండనే ఉన్నాయి.
- కర్మల అవసరం లేని దైవం నుండే కర్మలు జరుగుతున్నాయి. అంటే కదలని ఆత్మే, కదిలించే శక్తి కేంద్రం. అది మనయందే ఉన్నది.
- మౌనమే మహోన్నత కార్యక్షేత్రం. మౌనమే నిరంతర భాషా ప్రవాహం. మౌనమే అసలు భాషణం. ఈ అనుభవమున్నవాడికి ఇచ్ఛాశక్తి బలీయంగాను, క్రియాశక్తి పరిపుష్టంగాను, జ్ఞానశక్తి పరిపూర్ణంగాను ఉంటుంది. ఈ మూడు శక్తుల కలయిక

వలననే సాధకుడు పూర్ణమానవుడు కాగలుగుతాడు. దేవుణ్ణి ఎక్కడో వెదకటం మాని, తనలోని దివ్యత్వాన్ని తాను స్వయంగా గ్రహిస్తాడు. ఇది జ్ఞానపూర్వకమైన అనుభవం.

- ♦ ప్రారబ్ధం అహంకారం నుండే పుడుతున్నది. అహంకారం సంస్కారం నుండీ, సంస్కారం మూలవాసనల నుండీ, మూలవాసనలు జన్మలనుండీ, జన్మలన్నీ కర్మలనుండీ పుడుతూనే ఉన్నాయి.
- ♦ అహంకారాన్ని జయిస్తే ప్రారబ్ధాలు నశిస్తాయి. అహం స్ఫురణ పొటమరించి నెమ్మదిగా దేహాత్మభావన నశించి, ఆత్మభావన సంస్థితమయ్యే స్థితి ఇది. ఇదంతా నేనెవరన్న విచారణ నుండి సిద్ధిస్తుంది.
- ♦ కంటికి కనబడుతూ, మనసుకు తోస్తున్న వస్తు ప్రపంచాన్ని వైరాగ్యభావంతో, వివేకస్ఫూర్తితో పక్కకు తోసి, ఆత్మను దర్శించటమే అసలు పని. ఆ సాధనలో కృతకృత్యుడైనవాడే జ్ఞాని. జ్ఞానికి కర్తృత్వం లేదు. తాను కర్తకాదు కనుక, కర్మానుభవం వుండదు. కనుక వియోగం, దుఃఖం వంటివి లేవు. అందువలన జ్ఞాని, సదానందుడు, సర్వసృష్టినీ సమంగా చూడగలుగుతున్న జ్ఞానికి, ఆత్మానందం తప్ప వేరొకటి వుండదు. అయితే అనేక కర్మలు జ్ఞాని ద్వారానే జరుగుతుంటాయి. అన్నిటికీ జ్ఞాని, సాక్షిగా వుంటాడు. గురువుగా ఉంటాడు.
- ♦ ఈశ్వరుడు, గురువు, ఆత్మ ఒకటే !
- ♦ గురువు బయటా వుంటాడు, లోపలా వుంటాడు. అంతటా వుంటాడు. అన్నీ తానై వుంటాడు.కాని దేనినీ అంటించుకోక, గగనాన మొలచిన ఇంద్ర ధనుస్సుగా ఉంటాడు. గురువు అనుగ్రహము నిజానికి మనలోనే ఉన్నది. దానిని పొందటానికి కావలసిన అర్హత ఉంటే అది మనకు లభిస్తుంది. నిరపేక్ష, నిరామయస్థితి, నిర్వికార భావన, శుద్ధమనసే అనుగ్రహాన్ని పొందేవిధంగా అర్హతను కల్పిస్తాయి.
- ♦ పాండిత్యము, సాధనలు, పుణ్యకార్యకలాపాలు... ఇవన్నీ జ్ఞాని కరుణార్ద్రమైన కంటిచూపు ముందు దిగదుడుపే.
- ♦ గురువీక్షణ అంతర్వీక్షణం వైపు సాధకుణ్ణి నిదానంగా నడిపిస్తుంది.
- ♦ ఆలోచనకు ఆలోచనకు మధ్య ఏర్పడే విరామాన్ని పెంచుకుంటూ పోతే, విరామం పెరిగి పెరిగి ఆలోచన విరిగి, కరిగిపోతుంది. ఈ సాధనకు కావలసిందల్లా సూక్ష్మ, సునిశిత బుద్ధి. అంతే!

- భగవదారాధన, ఆత్మవిచారణ గురువనుగ్రహానికి గుర్తులే.
- కదలటము, కదలకపోవటము నిజానికీ రెండూ ఒకటే. అంతా అనుకోవటంలోనే ఉన్నది. కదులుతున్న దానిని బట్టి కదలిస్తున్న దానిని గుర్తిస్తున్నాం, గడియారంలో కదులుతున్న ముల్లు ద్వారా, దానిని నడిపిస్తున్న బ్యాటరీని గుర్తిస్తున్నట్లు. కనుక దేహం కదులుతున్నదంటే, కదిలించేది ఆత్మే కదా !
- నిజమైన కర్మయోగికి నేను చేస్తున్నాన్న భావనే లేదు. తనను నడిపిస్తున్న కర్తే అన్నింటికి కారణమని నిశ్చయించుకొని, సమర్పణతో, శరణాగతితో, వినయంతో కర్మబంధన లేకుండా హాయిగా ఉంటున్నాడు.
- ఇక భక్తి, జ్ఞానమార్గాలు రెండుగా అనిపిస్తున్నా, నిజానికి రెండూ ఒకటే.
- మాయ సైతం చైతన్యానికి ఛాయే. ఇది బింబ ప్రతిబింబ భావం. పోయేది దేహమే. మారేది దేహమే. ఎన్నటికీ పోని, మార్పెరుగని ఆత్మగా ఉండాలి.
- భక్తి యోగంలో భగవంతుడు-భక్తుడు అని రెండు భావాలున్నాయి. ఇదే ద్వైతం శరణాగతిలో రెండు లేవు. ఉన్నదొకటే. అదే ఆత్మ.
- సుఖసంతోషాలను, ఆనందాన్ని దాటి, ఎవరు ప్రేమమయులై ఉంటారో వారే జ్ఞానులు. ఒక వెలుగుగా, ప్రేమగా, శాంతిగా, ధర్మంగా, సత్యంగా, అచ్చంగా ఉంటారో వారే జీవన్ముక్తులు. జీవన్ముక్తే అసలు ముక్తి. అదే పరముక్తి. ఆ స్థితే అనంత శక్తి. అదే అమోఘ శక్తి.
- వాక్కు అగ్ని స్వరూపం. జ్ఞాని వాక్కు శుద్ధ చైతన్యం ప్రసవించే, ప్రసరించే దివ్య ఋక్కు. అది వేదతుల్యం. అదే గురుతు. గురుతు చూపేవాడే గురువు. రమణవాక్కు శుద్ధవాక్కు.
- "నేను చేస్తున్నానన్న భావనతో చేసే కర్మలన్నీ విత్తనాలు. విత్తనం వున్నంతకాలం, అవకాశం కలిగినపుడు, అన్నీ అనుకూలించినపుడు అది విచ్ఛిన్నమై, మొలకెత్తక తప్పదు. 'నేను' అన్న దేహభావం నశించనంతవరకు, జన్మించటం ఆగదు. ఆత్మవిచారమార్గంలో ప్రయాణించి, మూలాన్వేషణలో మూలశక్తిని గమనించగలిగినవాడికి మరణం, ఒక దివ్యానుభవం.

- తాను యింతకాలం నిలిచిన దేహాన్ని విడిచే సమయంలో జీవుడు, మరొక దేహాన్ని పొందే ఆతృతే మరణ క్షణం. అది మార్పే. ఈ ప్రస్థానం అనంతం. ఎందుకంటే, కర్మలన్నిటినీ దేహభావంతో చేసిన కారణంగా కర్మానుభవం పొందాలి కనుక, జన్మలు ఎత్తవలసిందే.
- నిజానికి మరణమంటే, కర్తృత్వభావన నశించటమే. ఈ స్థితిని సాధించటానికి ఎంతో సాధన చేయాలి. ఈ సాధనా ప్రక్రియంతా 'వదలటంలోనే వుంది; పట్టుకోవటంతో కాదు" – వదలనంతవరకూ బంధన తప్పదు. బంధన వియోగాన్ని దుఃఖాన్ని కలిగించి జీవితాన్ని యాతనామయం చేస్తుంది.
- జీవితం అంటే పోగొట్టుకుంటూ వుండటమే. వియోగమే అసలు సిసలు వైభోగం. బాల్యం, కౌమారం, యౌవనం... యివన్నీ, జీవుడు తన ప్రయత్నం లేకుండానే పోగొట్టుకుంటున్నవే. పైకి పోగొట్టుకుంటున్నట్లు కనిపిస్తున్నా, యిదంతా రాబట్టుకోవటం, నిలబెట్టుకోవటమే.
- జననమరణాలు రెండూ దేహానికి, అది ఆచరించే కర్మలకు సంబంధించిన విషయం. ఈ రెండూ లేని ఆత్మ, అసలు నేను'గా వుండటమే, నిష్ఠ. ఈ విషయం ఆత్మ విచారమార్గంలో వున్న సాధకుడికి క్రమంగా అనుభవంలోకి వస్తుంది. సత్యమన్నా, ఆత్మన్నా ఒకటే ! ఒక్కొక్క జన్మ, ఒక్కొక్క అనుభవం ద్వారా సత్యదర్శనం వైపు నడిపిస్తుంది. కడగా, సర్వానుభవము సమసిపోగా, ఆత్మ దర్శనంతో, పునరావృత్తి రహితస్థితి ఏర్పడుతుంది. అదే పరముక్తి. ఎడతెరిపి లేకుండా ఆగిన వర్షంవలె, చలనమెరుగని గాలివలె, అది చరమ ముక్తి.
- సత్సంగం, సత్సాంగత్యం, సద్గోష్ఠి, సదాచారం వంటివన్నీ జీవనగమనంలో ప్రధాన భాగాలై, జీవితం సాగాలి. వ్యర్థమైన ఆలోచనలకు మనసులో తావీయక, అచలంగా వుండాలి. ఈ సాధనకు మూలశక్తియైన మానసిక మౌనాన్ని ఆశ్రయించాలి. మౌనం మహాశక్తివంతమైన ఆధ్యాత్మిక భూమిక.
- ఒకసారి ఆత్మానుభవం కలిగిన తర్వాత, అది పోవటమంటూ వుండదు. ఆలోచనకు, ఆలోచనకు మధ్యవున్న విరామ కాలాన్ని పెంచుకుంటూ, స్థిమితంగా వుంటే, అనుభవం, అనుభూతిగా మారి, విభూతి స్థితిని కలిగిస్తుంది. ఇక

జననమరణాల గురించి ప్రస్తావనకు చోటెక్కడ ? ధ్యానము, మౌనము, యోగము, జ్ఞానము, అచలాద్వైతస్థితి సహజంగా ఏర్పడి ఆనందభూమికలో నిలకడ చెందిన సాధకుడు, సచ్చిదానందస్థితిని అందుకుంటాడు. అదే జీవన్ముక్త స్థితి. అదే ఆనందతారక స్థితి.

♦ దేహాత్మభావన, కర్మలు, మనసున్నంతకాలం చావు, పుట్టుకల గురించిన ఆలోచనలు తప్పవు. కనుక జన్మలు తప్పవు. ఆత్మభావనలో నిలకడ చెందిన జ్ఞానికి, సర్వేసర్వత్రా ఆత్మ తప్ప అన్యభావన వుండదు".

♦ ఆత్మకు రూపంలేదు. అది చైతన్యభూమిక. అదే మన స్వరూపం. అది ఆది; అనాది. అది నిత్యం, శాశ్వతం. అదే సత్యం. అదే ఆనందం. అదే అసలు. మిగిలినవన్నీ పైపై కనిపిస్తున్నవే.

♦ దృశ్యాలు దాటకపోతే సాధన సమసిపోతుంది. ఆలోచనకు ఆలోచనకు మధ్య వున్న విరామ కాలమే కాలం. అక్కడ వున్న ఎడమే ప్రదేశం. ఆ ఎడాన్ని ఎరుకతో విస్తరించుకోగలిగితే, అనుభవమూ లేదు. అనుభూతీ లేదు. ఉన్నదంతా నిరామయస్థితే!

♦ "అరుణాచల అంటూ నామస్మరణ చేసేవారి అహాన్ని నిర్మూలించు.

♦ నా మనసనె యింట్లో దూరావు. నన్ను బయటకు లాగి నీ హృదయంలో బంధించావు. నీ అనుగ్రహం విచిత్రం కదా! ఒకసారి నన్ను నీవాణ్ణి చేసుకుని, నన్ను వదిలిపెడితే లోకం నిన్ను నిందించదా?

♦ నా మనసు ప్రపంచంలో కలిసి, చెడిపోకుండా వుండాలంటే నువ్వు నా మనసులో ఎల్లవేళలా ఉండాలి.

♦ పంచేంద్రియాలనే దొంగలు నాలో వున్నారు. నా హృదయంలో నీవుండి, నన్ను వారి బారినుండి రక్షించు.

♦ నీవు ఓంకార సమానుడివి. కంటికి చూచే శక్తినిచ్చే అసలు కన్నువు. దేనినైనా చూడాలంటే నీకు కన్నెందుకు? నా దోషాలు తెంచు, గుణాలను పెంచు.

♦ లోకభావనలు నన్ను మోసగించకుండా రక్షించు.

♦ నీ కరుణాపూరిత జ్ఞానకిరణాలతో నా మనసును వికసింపచేసి అభయ వరదానం చెయ్.

- నా హృదయాన్ని ఆనంద సముద్రంగా మార్చు. మనసు మలగి, మౌనం వెలిగి, జ్యోతిర్మయుడవై నాయందుండు.
- లోకవిద్యలన్నీ అంతరించే మార్గం చూపిస్తున్నాయి. తరించే ఆత్మవిద్యను అనుగ్రహించు.
- నువు కొండవు. పలుకవు. నన్నూ మాట్లాడవద్దంటివి. ఎట్లా ? విషయవాంఛలు నశించి, పరమానందం నా స్వంతం చేశావు. నువ్వు నిత్యుడివి.
- కర్మానుష్ఠానం నాకు దూరం చేశావు. అది సంతోషమే. జ్ఞానమార్గాన్ని చూపించు.
- ఏమీ చేయకుండానే ఏ సాధనా తెలియకుండానే, తత్త్వం అంటే ఏమిటో తెలిసేటట్లు చేశావు. తెలుసుకున్నది నిజమనే స్థిరబుద్ధిని అనుగ్రహించు.
- సత్యం, జ్ఞానం, అనంతం, బ్రహ్మ అనే స్థితిని స్థిరపరచు.
- నిన్ను అనుభూతి చెందాలంటే మౌనమనే శుద్ధవాక్కు, వినిర్మల మనసు కావాలి. వాటిని నాకు చెందించు. నువ్వెంతో, నన్నంతటి వాణ్ణి చెయ్.
- అభేద, అద్వైత భూమికలో, నన్ను నిత్యానందమయుణ్ణి చెయ్. పరమాత్మ రూపం నీ సహజ రూపం. కొండవలె స్థూలంగా కన్పిస్తున్నావు. ఆలోచనా తరంగాలు నన్ను అడ్డుకుంటున్నయ్. స్వస్వరూపానుసంధానం చేయి.
- మాయావిషము తలకెక్కకుండా నన్ను రక్షించు.
- కోరికలు నశింపచేశావు. నిన్ను కోరకుకుంటున్న ఆ కోరికను సైతం పోగొట్టు.
- అద్యంతరహితమైన చిజ్జడ గ్రంథిని విప్పి నన్ను కాపాడు. అజ్ఞాన భూమికలో కొట్టుమిట్టాడుతున్న నాకు జ్ఞానం ప్రసాదించు.
- దేశకాలాతీతమైన ఆత్మభూమికలో మనం యిద్దరంగా కాక, ఒక్కటిగా వుండిపోదాం.
- నువు నాకు దొరకటం నేను పొందిన లాభమే. నీకు ఏం లాభం?
- నన్ను నీ దగ్గరకు పిలిచిన క్షణమే, నా అహం, ఉనికి, అస్తిత్వం, వ్యక్తిత్వం నశించినాయి.
- ప్రాణం వదిలే సమయంలో నిన్ను మరచినట్లైతే, దుఃఖభరితమైన జన్మ వస్తుందేమో? మరణ క్షణంలో నీ స్మరణ మరువకుండా చెయ్యి.
- అభేద వేద స్వరూపాన్ని నాకు అనుభవంగా అనుగ్రహించు. సాలెపురుగు తాను అల్లుకున్న గూటిలో చిక్కుకుని మరణించినట్లు, నీ కృపావలయంలో

చిక్కుబడిపోయాను. ఎందరో భక్తులు నిన్ను కీర్తించి, ఎముకలు అరిగేట్లు సాధన చేయటం నీకు ఆనందం కలిగించింది. నా మాటలు కూడా విను.

- ఈ అంటున్నవన్నీ అవిద్యా స్వరూపాలే. మన్నించు.
- ఎవరో దోచుకు వెళ్లారనీ, వారు దొంగలేనని ఎందుకు బాధపడటం? ఇన్నాళ్లూ వస్తువులను మన దగ్గర ఉండనిచ్చినందుకు ఆనందంగా ఉండాలి. మన ఆస్తి అనుకుంటున్న మన దేహాన్ని, మనని దొంగిలించుకుని యముడు వెళ్తుంటే ఎప్పుడైనా, ఎవరికైనా ఫిర్యాదు చేశామా? ఇన్నాళ్లుంచినందుకు ఇప్పటికైనా తీసుకువెళ్లినందుకు ఆయనకు కృతజ్ఞతలు! ఎవరూ దొంగిలించలేని ఆత్మే మనం కదా?
- అందరూ మనకు నమస్కరిస్తున్నరంటే, వారికి మన నమస్కారాలు ముందే అందినయ్యన్న మాట.
- జ్ఞానికి జాతకాలు ఉండవు. గ్రహస్థితులన్నిటినీ, దాటి, భగవదనుగ్రహాన్ని మిగుల్చుకున్న జ్ఞానికి రాబట్టుకోవటం, పోగొట్టుకోవటమంటూ ఏమీ లేదు. ఉండటమే ఉన్న స్థితి. అదే సహజస్థితి.
- అక్షరజ్ఞాన మెరుగనివాడు. మతిస్థిమితం లేనివాడు, ఏమీ తోచనివాడు, ఏవేవో చేస్తుంటాడు. ఎందుకు చేస్తున్నావని అడిగితే 'ఏమీ లేదు' అంటాడు. 'ఏమీ లేదు' అనుకోవటమే తెలిసినతనం.
- శరీరం స్వస్థత కోల్పోయినప్పుడు, నడవలేని స్థితి ఏర్పడినప్పుడు, కఱ్ఱ ఆధారంతో నడుస్తాం. అంటే కట్టెకు, కట్టె ఆధారమన్నమాట. ఇంతకీ ఈ రెండు కట్టెలనూ నడిపిస్తున్న ఆత్మ సంగతేమిటి?
- దేహమనే పూరిగుడిసెలో, ఆత్మ అనే ఏనుగును కట్టినట్లే, దేహంలో జరిగే కదలికలు, మెదలికలు అన్నీ ఆత్మవే. దేహం తనంత తానుగా కదలగలదా?
- అందరం విగ్రహారాధకులమే. శరీరము విగ్రహమే. మనం దానికి స్నానం చేయిస్తున్నాం, బట్టలు తొడుగుతున్నాం. అలంకారం ఎందుకు చేస్తున్నాం? అవసరం కనుక, ఆనందాన్నిస్తుంది కనుక! విగ్రహారాధన అంతే! విగ్రహాన్ని రాయిగా భావిస్తున్నవారు, ఎప్పుడైనా తమ దేహాన్ని తోలుబొమ్మ అనుకోగలిగారా?

- అచ్చుకాక ముందున్నది కాగితమే. అద్దిన తర్వాత అక్షరాలు కనపడుతున్నాయి. అంతే! కాగితం ఎక్కడికి పోయింది? కనపడుతున్న దేహంలో వున్నదీ, ఆత్మే!
- దొంగలకు దొంగతనం వృత్తి. దొంగతనానికి బయలుదేరే ముందు, వస్తువులు దొరకాలని, తామెవరకీ దొరక కూడదని దేవుడికి మ్రొక్కుకుని, దొరికినదానిలో కొంత దేవుడికి ఇస్తామంటారు. ఇస్తారు కూడా. కానీ దొరలుగా చెలామణి అయ్యేవారు దొరికినది దోచుకుంటారు. మ్రొక్కుతారు. కానీ మొక్కు చెల్లించరు. దైవాన్నైనా సరే అడగటం దీనత్వం కదా !
- నది మధ్యలో ఉండి, దాహం దాహం అంటూ కేకలు వేయటం ఎంత అవివేకం! ఉన్నదంతా అనుగ్రహమే అయినప్పుడు మళ్లీ మళ్లీ అడగటం అవసరమా?
- మనిషి మరణించినప్పుడు పోయినాడంటున్నారు. ఎక్కడికి వెళ్లాడనుకుంటున్నారంటే, జవాబు లేదు. వాడు వచ్చిందీ లేదు. ఎక్కడికో వెళ్లిందీ లేదు. ఉండటమే నిజం. అదొక స్థితి, అంతే!
- పండితులకు శాస్త్రాలు అక్కరలేదు. పామరులకు అవి అర్థం కావు. అవి తెలుసుకోవాలనుకునేవారికి ఆసక్తిని తీరుస్తాయి. అంతే! ఆచరణకు నోచని శాస్త్రాలు ఎవరికి అక్కరకొస్తాయి? శాస్త్రమంటే జ్ఞాపకమే!
- వెలుగుకి చీకటికి అతీతమైనది బ్రహ్మము. మనమనుకుంటే అవి ఉన్నాయి. గమనించటం ఆపేస్తే మన వరకు అవి లేవు. ఉన్నది బ్రహ్మమే.
- సంయమనమున్న వాడే సమన్వయం చేయగలడు. సంఘర్షణ అంటే సమన్వయం లేకపోవటమే.
- కూచున్నవాణ్ణి తానే తీసుకువెళ్తున్నట్లు పల్లకీని మోస్తున్న బోయీ, తెరచాప కొయ్య మీద వాలిన పక్షి తామే పడవను నడిపిస్తున్నాం అంటూ ఎంతగా భ్రమపడుతుంటయ్యో. మానవుడు కూడా అన్నీ తానే చేస్తున్నట్లు అహంకరిస్తుంటాడు. మోస్తున్న బోయీలు, పడవ నడుపుతున్న సరంగులు, చేస్తున్నాననుకుంటున్నవాడు గమనించవలసినదొక్కటే! చేయిస్తున్నవాడు ఒకడున్నాడని!
- సన్యాసం స్వీకరించటమంటూ ఉన్నదా ! సన్యాసిగా ఉండటం ప్రధానం.

# అరుణగిరి ప్రదక్షిణా మహాత్మ్యం

- అరుణాచల ప్రదక్షిణం నిజానికి శివశివానీలకు చేసే సాక్షాత్ ప్రదక్షిణే!
- ప్ర – అంటే పాపసంహారం.
- ద – కామ్యసిద్ధి
- క్షి – జన్మరాహిత్యం
- ణ – జ్ఞానమార్గంలో ముక్తి
- పురాణసంస్కృతి అరుణాచలం ఒక గొప్ప స్మృతి.
- అరుణాచలం, జీవుడికి దేవుడికి ఉన్న దివ్య ప్రబంధం, కనబడే పూలు, కనబడని దారం కలిసి ఉన్నట్లు ! శివ కుటుంబమంతా, కొలువుదీరిన కైలాసమే, అరుణాచలం!
- వెన్నెలలో అరుణాచల దర్శనం ఒక అపురూప ఆధ్యాత్మిక అనుభవం. మనసు నిశ్చలం చేసుకొని, నెమ్మదిగా నడుస్తూ, గిరిని చూస్తూ, వెన్నెలలో ప్రదక్షిణ చేస్తున్నప్పుడు పరమశివ భంగిమలు, ఆకృతులు, అవిష్కృతమవుతూ లోచూపును విశాలం చేస్తూ, అంతరంగ స్పర్శను అనుగ్రహిస్తాయి. క్రమ వైరాగ్యాన్ని, క్రమ సన్యాసాన్ని అనుగ్రహించి, మనసును పరమేశ్వరాయత్తం చేయగల శక్తి, గిరి ప్రదక్షిణలలో ఉన్నది.
- అయిదు ముఖాలుగా గోచరించే సదాశివ స్వరూపం, సాధకుణ్ణి అంతర్ముఖుణ్ణి చేసి, జ్యోతిర్మయమైన లోవెలుగును ఆత్మగా దర్శనీయం జేసి ఆత్మనిష్ఠలో నిలకడ చెందించే పరమాద్భుత సాధన, గిరి ప్రదక్షిణ! గిరి, గురువు, గురి ఏకమై నిలిచిన అరుణాచలదర్శనం ఆత్మదర్శనం కంటే భిన్నం కాదు.
- అరుణాచల స్మరణమే ముక్తి! ప్రదక్షిణ అనుగ్రహించే శాంతి, శక్తి, వైరాగ్యం, జ్ఞానం, పరమానందం అనిర్వచనీయం. అది అనుభవైక వేద్యం. హృదయంగమం. జీవాత్మ, పరమాత్మల నిత్య సంగమం!
- ప్రయత్నమంతా కనబడుతున్నది. కనుక అది జీవప్రజ్ఞ.
- ప్రేరణ కనబడటం లేదు. కానీ అంతటికీ అదే కారణమౌతున్నది. అది దైవప్రజ్ఞ.
- ఈ సన్నివేశంలో ఈషణ త్రయాలు నశించి ఉంటాయి. పిల్లలు, ఇల్లు, ఇల్లాలు మూడు బంధాలుగా ఉన్నా, బంధన స్థానం మాత్రం ప్రాపంచికమే.

- సంపద, పొగడ్త, కీర్తి, ఆశ, ప్రత్యేక గుర్తింపు వంటివన్నీ నశించి, ఆత్మవలె నిశ్చల నిర్మల స్థాయి అన్నివేళలా అనుభవంగా ఉండిపోతుంది.
- త్యాగమే అమృత స్థితి. సత్కర్మలు, అంగబలం, అర్ధబలం శాశ్వతాన్ని ఇవ్వలేవు. త్యాగమొక్కటే ఆరని దీపం వలె అమృతత్వాన్ని కల్పిస్తుంది.
- బంధనలు, బంధుత్వాలు చివరకు వైరాగ్యం వైపు నడిపిస్తయ్. పెరిగేదంతా ఒరిగేదే. కనబడుతున్నదంతా పోయేదే.
- ప్రాపంచిక ఆనంద కెరటాల మీద విహరిస్తున్న జీవుడు ఏదో క్షణంలో కెరటంతో పాటు విరగక, ఒరగక తప్పదు. స్వాత్మానంద లహరీ విహారం నిరాటంకంగా సాగుతూనే ఉంటుంది.
- నేను దేహాన్ని అనుకోవడం అజ్ఞానం. నేను దేహాన్ని మాత్రమే కాదను కోవడం విజ్ఞానం. నేను ఆత్మను అనుకోగలగటం ప్రజ్ఞానం.
- మనో నాశనం ద్వారా గుణాతీత స్థితిని పొందాలి.
- మంచీ – చెడు, పాపం – పుణ్యం మనోకల్పితాలు. మనసు అనుభవించే రెండు స్థితులవి. ఉన్నదంతా ఆనందమే. ఉన్నదంతా ఆత్మే!
- సద్గురువు లభించినపుడు ప్రయత్నం వేగవంతమౌతుంది. ఆత్మ విచారమార్గం స్పష్టమౌతుంది. ఆత్మ నిష్ఠ అనతికాలంలో సంభవిస్తుంది.
- సత్సంగం, సత్యాంగత్యం, సద్గోష్ఠి, సమ్యక్ సంకీర్తన, సదాచారం, ధ్యానం, ఆత్మవిచారం, ఇవన్నీ ఏక కాలంలో లభించేది గురుసన్నిధిలోనే!
- మనల్ని మనం తెలుసుకుంటే అన్నీ తెలుసుకున్నట్లే ! ఆ ఒక్కటీ తెలియకుంటే తెలుసుకున్నామనుకున్నదంతా నిష్ప్రయోజనమే.
- మానవ జన్మ పరమార్థం, ఎరుకను సాధించుకోవటమే. సాధనా మార్గం తెలియాలి. నడిపించే గురువు దొరకాలి. నడిచే శక్తి ఉండాలి. తీవ్ర సాధన ద్వారానే అది సాధ్యం. గుర్వనుగ్రహమే చోదక శక్తి!
- గురువు బయటా వున్నాడు. లోపలా వున్నాడు. బయట బోధకుడుగానూ, లోపల అంతర్వాణిగానూ ఉన్నాడు. గురువు, ఈశ్వరుడు, ఆత్మ ఒకటే. అవి మూడు స్థితులు. నిజానికి ఆత్మ విచారమూ గురువే, అదీ ఆయన అనుగ్రహించేదే. ఆ అనుగ్రహమే గురువు.

- "అసలు నేను"ను పట్టుకునే దాకా జరిగేదంతా పోరాటమే. పోరాటమంతా అసలుకాని దానితోనే. అంటే ఆత్మానుభవం కోసం చేసే ప్రయత్నమే. పొందేదాక పోరు తప్పదు. ఈ సాధనను సరైన దారిలో నడిపించే గురువు లోపలే ఉన్నాడు. ఆయన మానవదేహంలోనే ఉండాలని లేదు. ఏ రూపంలో వున్నా గురుతత్త్వం ప్రధానం.
- సర్వమతాల బోధ శాంతిని అనుభవించమనే! సమర్పణ, శరణాగతి, వినయం శాంతికి మార్గాలు. మానవుడి స్వభావం శాంతే. ఆనందమే. మనతో మనం నిరంతరం కూడి  ఉండగలిగితే అదే అసలైన శాంతి. పరాయివస్తువుతో కూడి ఉన్నందున, శాంతిని అనుభవించలేకపోతాం.
- నీట నిండా మునిగీ దాహం తీరటం ఎట్లా అని వగచే స్థితి అవిద్యే. కదా! మంచుకొండలలో మౌనం పాటించి, పుణ్యతీర్థాలలో స్నానమాడి, పుణ్యక్షేత్రాలను దర్శించి వీటివలన శాంతి లభించిందని తృప్తిపడేకన్న నీలో నీవు, నీతో నీవు ఉండగలిగితే పరమశాంతి తథ్యం.
- దేహం, మనసు, ఆత్మ ఈ మూడు కూడితే మనం. అందులో ఆత్మ దేనితోనూ కలవదు. దేహం–మనసు విడిగా మనలేవు. కనుకనే దేహం వలన మనస్సు, మనసు చేసే పనుల వలన, దేహం యాతనకు గురౌతుంటాయి. ఆత్మ మాత్రం అన్నిస్థితులలోనూ, అన్నివేళలా స్థిమితంగా ఉంటున్నది.
- ప్రాపంచిక ఆలోచనలోనుంచి కర్మలోనుంచి మనమెంత దూరంగా ఉండగలిగితే మనం ఆనంద శాంతులను అంత దగ్గరగా అనుభవించగలం. బంధన, ఆపేక్ష లేకుండా కర్మలు చేయాలి. అప్పుడే శాంతి అనుభవంలోకి వస్తుంది. ఆనందసాధన గానీ, శాంతికాముకత కానీ, నిజానికి ఆత్మాన్వేషణే. ఎందుకంటే, ఆత్మే సచ్చిదానందం కనుక!
- నిరంతరం మార్పుచెందుతుండే దేహానికే జననం, మరణం. మార్పెరుగని ఆత్మకు ఈ రెండూ లేవు. అది నిత్యం, సత్యం, శాశ్వతం.
- మరణం అంటే మార్పే.

- కాలాతీతమైన ఆత్మకు, మూడు కాలాలంటూ లేవు. మరణ సమయంలో జీవుడు మనోభూమికలో ఏ ఆలోచనను నిలుపుకుంటాడో, ఆ ఆలోచనలకు అనుగుణంగా మరొక జన్మ ఎత్తుతాడు.
- మూల వాసనలు నశించనంతవరకు ముక్తి లేదు. జన్మలు ఉన్నంతవరకు కర్మలు తప్పవు. కర్మలు ఉన్నంత వరకు జన్మలుంటాయి. ఆత్మానుసంధానమే అసలు ముక్తి. జీవించి ఉండగా అది కలిగితే, అది జీవన్ముక్తి.
- ఇంతకీ ఆత్మానుసంధానం సాధించటమెలా?
- ఆత్మానుసంధానమంతా ఒక అద్భుత అంతరంగ ప్రక్రియ. జరుగుతున్నదీ, ఏం జరుగుతున్నదో కనబడుతున్నదీ... ఇదంతా ఒక ఆట. ఆటను చూస్తున్నది దేహం, మనసు. అనుభవిస్తున్నవీ ఆ రెండే. కానీ ఆటను అనుభవానికి అతీతంగా, కేవలం సాక్షిగా ఉంటున్నదే, అది ఆత్మ. అదే మనం. ఆత్మానుభవం కోసం చేసే ఎడతెగని సాధనే అసలు సేవ.
- గురువు, భగవంతుడు, ఆత్మలేనిదెక్కడ?
- గురువుతో సన్నిహితత్వం అంటూ ఏమీ లేదు. తామరపువ్వు చుట్టూ కప్పలుంటాయి. ఏ అనుభవం లేకుండా, ఎక్కడినుండో తేనెటీగలు వచ్చి తేనెను అనుభవిస్తుంటాయి. ఇదీ అంతే.
- దైవం మాట్లాడవలసిన పని లేదు. పని జరగటం ప్రధానం. ప్రయత్నించగలిగితే మౌనం ద్వారా ఎంత పని జరుగుతుందో తెలుస్తుంది. మన ఇంట్లో దీపం వెలగటానికి టర్బైన్ అవసరం లేదు. దానినుండి ప్రవహించే లేశ మాత్రమైన విద్యుత్తు చాలు. ఆ విధంగానే, మౌనినుండి వెలువడే మౌనతరంగాలు సర్వసృష్టిని కదిలించగలవు.
- సాధననే పరమచరమంగా భావించి ఆగిపోవటం వృథా. ఏ సాధనైనా ఆత్మానుభవానికి దారితీయాలి.
- ప్రపంచాన్ని అజ్ఞాన భూమికలో చూస్తే అది మిథ్య. అదే ప్రపంచాన్ని జ్ఞానపరంగా దర్శించగలిగితే, అది సత్యం.

- అహం నశించటమే ముక్తి. అహం, తన కార్యకలాపాలను కొనసాగించటానికి దేహం కావాలి. దేహంతో కూడి ఉన్నంతసేపూ అహం 'బంధన'ను కల్పిస్తుంది. అహం వీడటమే ముక్తి.
- సాధనలో ఏర్పడే అనేక సిద్ధులు సాధనకే అడ్డంకి. సాధకుడిని ఎటూ పోనీయవు. వాటిని పట్టించుకున్నంతసూపూ ఒక దారుణ ఆకర్షణాక్షేత్రం ఏర్పడుతుంది. సిద్ధులను ఉపేక్షించటమే ఉత్తమం. లోకకళ్యాణం కోసం వాటిని వినియోగిస్తే ఏ బంధనా లేదు.
- దేనినైనా పొందాలనుకున్నవాడు పోగొట్టుకోవటానికి సిద్ధం కావాలి. ప్రపంచ భావన అంటే దేహాత్మ భావనే. అది లేకపోతే మిగిలేది ఆత్మే.
- హఠయోగం వంటి వాటిద్వారా రోగాలు పోతయ్యా అంటే యోగం కంటే ముందు రోగమంటే ఏమిటో తెలుసుకుంటే సగం పరిష్కారం లభిస్తుంది.
- దేనికి రోగం? ఎవరికి రోగం? ఈ రోగాన్ని అనుభవిస్తున్నదెవరు? ఈ ప్రశ్నలన్నీ ఆత్మవిచారం వైపు నడిపించి, రోగ భావనను దూరం చేస్తాయి. ఇన్నిన్ని అనుభవాలకు మూలమైన మనస్సును ఎరిగి, దాని స్వస్థానంలో కలుపుకో గలిగితే, అంతా సచ్చిదానందమే. అదే అసలు ముక్తి.
- ఏ కర్మా ఫలాన్ని ఇవ్వలేదు. కర్మలన్నీ జడాలే కనుక, ఫలితాన్ని ఇచ్చేది కర్త అయిన దైవమే.
- కోరికలు తీర్చుకోవటానికి కాక, కర్మలన్నిటినీ పరమేశ్వరుడికి సమర్పిస్తూ చేయగలిగితే మనస్సు పరిశుభ్రం అవుతుంది. శుద్ధ మనసు, ముక్తి సాధనకు దారి తీయిస్తుంది. అందువలన శాంతి, ఆనందం లభించి క్రమంగా సంసార యాతన నుంచి మానవుడు బయటపడతాడు.
- శరీరం, వాక్కు, మనస్సు... ఈ మూడింటిని సాధనలో జాగ్రత్తగా వాడుకోవాలి. శరీరం ద్వారా పూజ చేయాలి. వాక్కుతో జపం చేయాలి. మనస్సుతో చింతన చేయాలి. దేహం కన్నా వాక్కు, దానికన్నా మనసు, తద్వారా జరిగే పూజ, జపం, చింతన ఒకదానికంటే మరొకటి ఉత్తమం.

- ఇంతకీ పూజ దేనికి చేయాలి? సమస్త జగత్తును పరమేశ్వర రూపంగా భావించటమే అసలు పూజ. పంచభూతములు, సూర్యుడు, చంద్రుడు, సర్వజీవులు కలిపితే అష్టమూర్తులు.
- జీవ, జగత్, జగదీశ్వరులుగా ఉన్న మూడు వ్యవస్థలు ఒకటే. వాటిని పూజించటమంటే తమను తాము మన్నించుకోవటమే.
- వాక్కుతో ఒక నామాన్నో, మంత్రాన్నో జపించటమే జపం. లెక్కకు లోబడి జరిగే కలాపమిది. సాధన తీవ్రమై జపం సహజంగా సాగుతున్నప్పుడు అది అజపం కావాలి. ఔతుంది. గాలి పీల్చినంత సహజంగా జరుగుతుంది. ఈ స్థితిలో మనసు, ధ్యానంవైపు మరలుతుంది. మౌనం తరలివస్తుంది.
- బిగ్గరగా పలుకుతూ, దానికన్నా మంద్రస్థాయిలో అనుకుంటూ అంతకంటే మౌనాన్ని ఆశ్రయించి సాగించే ధ్యానం సర్వోత్కృష్టం. అభ్యాస వైరాగ్యముల వలననే ధ్యానం సులభతరమౌతుంది. ఉత్తమమైన ధ్యానం వలన కోరికల తీవ్రత క్రమేపీ నశించి, ఆలోచనా ప్రవాహపు ఒరవడి తగ్గి, నిశ్చల, నిర్మల, నికేతన, నిరంజన స్థితి కలుగుతుంది. ఆ స్థితి పరమానందాఇన్న అనుగ్రహిస్తుంది.
- ధ్యానం వలన మనసు అణుగుతుంది. అంతర్ముఖం అవుతుంది. బయట తిరగటం అలవాటున్న ఇంద్రియాలన్నీ లోపలకు మరలటమే ధ్యానం ఒకసారి అంతర్ముఖత్వం కలిగితే బాహ్య వస్తువుల యందు అపేక్ష నశించి ఉపేక్ష కలుగుతుంది. ఇదే ధ్యాన ఫలం.
- యజ్ఞగుండంలో ధార తెగకుండా ఆగకుండా నేతి ధార ఏవిధంగా సాగుతుందో, సాగర సంగమం జరిగే వరకు, నదీ ప్రవాహం ఏ విధంగా సాగుతుందో ఆ విధంగా ధ్యానం జరగాలి. చేసేది ధ్యానం కాదు. జరగటమే దాని లక్షణం. ఉంచటమే దాని బలం. మనలో మనం ఉండటమే ధ్యానం. మనతో మనం ఉండటమే యోగం.
- సహజ ధ్యానం జరగాలంటే సరళ చింతన ఉండాలి. అంటే లక్ష్యం వైపు మనసు ఏకాగ్రంగా నడవాలి .ఎన్ని అవాంతరాలు ఎదురైనా చింతన సూటిగా, సరళంగా, గంభీరంగా జరగాలి. నేను దేహమేనన్న భావన నుంచి నేను ఎవరు అనుకునే

ప్రశ్న వైపు చింతన మళ్ళాలి. నేను దైవం కాదన్న ఆలోచన నుంచి దైవమే నేనన్న స్థిమిత, నిశ్చిత భావనలో మనసు సంస్థితం కావాలి. ఆ స్థితిలో తత్వమసి మహా వాక్యం అనుభవ రససిద్ధమవుతుంది.

- నేను వేరు, దైవం వేరు అనుకోవటం ద్వైతం. వేరు కాదనుకోవటం, అదే స్థితిలో ఉండగలగటం అద్వైతం. అదే అసలు ముక్తి.
- భావశూన్య స్థితి ఏర్పడితే అది పరభక్తి. నామరూపములయందు తిరుగులేని నమ్మకముంటే అది అనన్య భక్తి. నామరూపములు అశాశ్వతాలు. అవి ఉన్నంత కాలం బావనలు అనివార్యం. భావరహిత స్థితికి ధ్యానం ద్వారా చేరుకోవాలి.
- నేను చేస్తున్నానే భావం అహం. ఎవరో చేయిస్తున్నారనే భావనే సమర్పణ. అదే శరణగాగతి. అదే అకర్తృత్వం. అకర్తృత్వమే ముక్తి.
- ప్రాపంచిక, మానసిక కార్యకలాపాల నుంచి విముక్తి కలిగి సాధకుడు పరమ ప్రశాంతచిత్తుడై సదా ఆనందుడై ఉంటాడు.
- మనసును దాని స్వస్థానమైన హృదయంలో లయం చేయాలి. కర్మ భక్తి జ్ఞానయోగాలు ఈ విషయాన్నే మూడు విధాలుగా బోధిస్తాయి. స్థూలంగా భగవద్గీత బోధించింది ఇదే.
- కర్మయోగంలో అహం నశించి, భక్తి యోగంలో అహం స్ఫురణ కలిగి, జ్ఞానయోగంలో ఆత్మానుభవం పొంది, సాధకుడు తన మనస్సును హృదయంలో లయం చేసి అద్వైత భావనలో అమదానందుడై, నిరామయుడై ఉంటాడు.
- ఇంత కాలమూ దేహమే నేననుకున్న సాధకుడు, తాను దేహం మాత్రమే కాదని, నిశ్చింతగా 'నేను ఆత్మను' అనే ఎరుకలో ఉంటాడు.
- కోర్కెలు రెక్కలు విప్పుకొని, వాసనలు తిరిగి తలెత్తి సాధకుణ్ణి యధాపూర్వస్థితిలోకి నెట్టివేస్తాయి. మనసు, ప్రాణము, శ్వాస, ఇవన్నీ స్థితులే. ఇవి తమ శక్తిని ఆత్మనుండి గ్రహిస్తాయి. ఆత్మ అన్నిటినీ కదిలిస్తుందే కాని, తాను కదలదు.
- హృదయంలో లీనమైన మనసు, ఆత్మను గురించి ఒకే చింతనలో ఉండగలిగితేనే మనసు నాశనమవుతుంది.
- జ్ఞాని నిత్యసుఖి. ఆనందం ఆకారం ధరించినవాడు. నిర్వికారుడు. నిరామయుడు.

నిరంజనుడు. నిర్వికల్పుడు. సమస్త వస్తు సముదాయము తన చుట్టూనే ఉన్నా, దేనినీ తనదని భావించడు. ఏమీ లేకపోయినా సార్వభౌముని వలె ఉంటాడు. ఏ కర్మగానీ, ఏ వస్తువుగానీ, ఏ వ్యక్తిగానీ ఆయనకు ఆనందం కలిగించలేవు. నిజానికి అందరికీ, అన్నిటికీ ఆనందాన్ని ఇవ్వగలిగిన స్థితి జ్ఞానిది.

♦ మనసంటూ నిజానికి లేదు. అనేక ఆలోచనలు మూటకడితే, అది మనసౌతున్నది. నిలువుపోగు, అడ్డపోగు కలనేతగి ఉంటే వస్త్రం ఏర్పడుతున్నట్లు. పోగులు విడదీయటం మొదలుపెడితే వస్త్రం అంటూ ఉండదు. మనసు పరిస్థితీ అంతే. పట్టించుకున్నంత కాలం మనసు ఉంటుంది. పట్టించుకోవటం మానివేయగానే మనసు మలగిపోతుంది.

♦ ఏ కార్యకలాపమూ లేని నిద్రావస్థ నుండి బయట పడిన జీవుడు నేను హాయిగా ఉన్నానంటున్నాడు. అదీ సంగతి! ఆందోళనకు – ఆనందానికి; బంధనకు–మోక్షానికి మనసే మూలం! మనసు లేకపోతే కథా లేదు, వ్యధా లేదు. ఆ విధంగానే ఈ నేను ఎక్కడనుండి మొదలవుతున్నదో అన్వేషించడం మొదలుపెడితే దేహపరమైన నేను నశిస్తుంది.

♦ దేహమే నేననుకోవటమే అహంకారం. నేను దేహము మాత్రమే కాదనుకోవటమే అహం స్ఫురణ.

♦ అహం నశించి అహం స్ఫురణ కలవగానే ఆత్మాన్వేషణ తీవ్రమై అజ్ఞానం, అహంకారం, అస్పష్టత, అవిద్య నశించి పరిపూర్ణమైన శుద్ధాత్మ అనుభవంలోకి వస్తుంది. ఆపై అనుభవమూ నశించి ఉనికి మాత్రమే మిగులుతుంది. దేహభావం నశించినందున జ్ఞాని లోకాన్ని అభేదంతో, అద్వైతంగా, ఆత్మమయంగా దర్శిస్తాడు. అన్నీ పోగా ఆత్మే చివరికి మిగులుతుంది.

♦ బంధన లేకుండా పనులు చేయగలగటం ఆధ్యాత్మ భూమికలో ఒక అద్భుతస్థాయి ఆ స్థాయిలో అది, అతడు, వాడు అన్న పరాయితనం నశించి కనిపిస్తున్నదంతా, అనుకుంటున్నదంతా, ఉన్నదంతా నేనే, నేరను తప్ప వేరొక వస్తువే లేదన్న భావన స్థిరమౌతుంది. అదే సర్వాత్మ భావన. ఈశ్వర భావ.

♦ మన భయమంతా, బాధంతా ఇంకో వస్తువు వలననే కదా ! మరొక వస్తువే లేదని, ఉన్నదంతా ఒకటేనన్న భావన స్థిరంకాగానే భయము, బాధ దూరమై

ఆనందం మాత్రమే మిగులుతుంది. ఆనందం మన నిజస్వభావం. కనుక స్వస్థితి నిలబడిపోతుంది. దానినే సంస్థితం అంటాం. అంటే మనతో మనం ఉండటం! ఆ అనుభవం వినూత్నంగా ఉన్నా, అదే అసలు స్థితి.

- "ఏమీ లేదు" అనుకోగలిగితే, ఆత్మ విచార మార్గంలో ఆత్మ తప్ప మరొక వస్తువే లేదని స్థిర భావన కలుగుతుంది.
- "ఊరికే ఉండండి" అంటే నికామంగా ఉండగలిగితే,జరగవలసినవన్నీ మన ప్రమేయం లేకుండా జరిగిపోతూ ఉంటాయి. మనం కేవలం సాక్షులుగా ఉండిపోతాం! అది పరమాద్భుత సహజస్థితి, ప్రశాంత, ప్రసన్నస్థితి.
- ప్రపంచం, ప్రకృతి అంతా ఆత్మయొక్క ప్రతిబింబంగా కనిపించి, ఈ కనిపిస్తున్న దానికి మూలమైన కర్త ఒకటి ఉన్నదని స్ఫురణ కలుగుతుంది. ఆ కర్తకు దైవమని, శక్తి అని మనం పేర్లు పెట్టుకుంటాం. వేదాంత పరిభాషలో దాని పేరు "సత్"!

## గణపతి ముని చేసిన శ్రీరమణ సంకీర్తనం

- పెనుచీకటి కావలనున్న తేజోరూపియైన ఈశ్వర దర్శనం చేయించావు. నీ దివ్య చరణారవిందాలకు వందనం. నీ చరితం పాపం. అది సర్వ పాపహారం. నీవు కరుణానిధివి. అరుణాచలమే నా తలపు.
- భగవద్గీత నెరిగిన వాడవు.
- మహేశ్వరుడి మౌన రహస్యం నీవు.
- పండిత గణపతులకు నీవు గురువువు. గుణసాగరుడివి. మాయ వెనుకనున్న మహాతత్త్వం నీవు.
- అచలుడవు. ఇంద్రియములను జయించినవాడవు.
- ప్రాణం నిలుపుకోవటం కోసమే పొట్ట నింపుకుంటున్న వాడవు.
- జన్మ సాగరాన్ని పాటిస్తూ అందరి మతులను చక్కదిద్దువాడవు.
- మానావమానాలకు అతీతుడవు.
- అంతశ్శత్రువులను జయించిన ఆనందలహరీ విహారివి.
- అహంకార, మమతలను దాటిన వాడవు.
- అజ్ఞానంలో ఉన్నవారికి వెలుగు చూపే వాడివి.
- గోలోకవాసి వలే కౌపీన ధారివి.

- గుణాతీతుడవు, నైష్ఠిక బ్రహ్మచారివి.
- నెమలి వాహనం లేదు. స్నానం చేయటానికి దివిజ గంగ లేదు. పార్వతి లేదు. ప్రమథులు లేరు. అయినా మాయందున్న దయతో అరుణాచలానికి వచ్చావు.
- ఆరు ముఖాలు వదిలి, వల్లీ దేవసేనలను వదిలి, మానుషవేషం ధరించిన వాడవు.
- యోగివి, ప్రజ్ఞానివి, సాధువువి, గురువువి, అంతెందుకు అవనిపై అవతరించిన కార్తికేయుడివి.
- బ్రహ్మకి, శివుడికి ఓంకారార్థం ఉపదేశించావు.
- వ్యాస, శంకరుల వలె జగదాచార్యుడవు.
- ధర్మాచరణ సన్నగిల్లి, లోకాలు పాపాల పుట్టలుగా వున్న వేళ, భగవద్భక్తి పలచబడుతున్న వేళ, మానవదేహం ధరించిన నీవే సర్వులకూ శరణ్యం.
- వైరాగ్యం నీ సంపదైనా కరుణించటం మానలేదు. కర్మాచరణ లేకపోయినా ధ్యానం వీడలేదు. కోరికలెరుగని నీవు భక్తుల్ని రక్షిస్తూనే వున్నావు.
- వాదాలు నశించి వేదం నిలబడుతుంది. ధర్మం సమంగా వర్తిస్తుంది. సజ్జనులంతా ఒక్కటౌతారు. ఇదంతా నీ రాకవల్లనే.
- 'నేను' ఎరిగిన వాడవు. దానిని సర్వభూతములయందున్న వెలుగుగా చూచువాడవు. అనేకం నుంచి ఏకంలో నిలకడ చెందినవాడవు, గురుమూర్తియైన వాడవు.
- లోకంలో వుంటూనే లోకాతీతంగా వెలుగొందినవాడవు.
- నీ శుభవీక్షణం పుణ్యప్రదం.
- నీవు గురుమూర్తివి. భేదమెరుగని అద్వైతస్ఫూర్తివి.
- జీవుడు, జగత్తు, జగన్నాథుడు ఒకటే అని బోధించావు.
- నీ దివ్యబోధ నాకు అభేధ స్థితిని అనుగ్రహించింది.
- పీ కృప వుంటే నేను కూడా అంతటా ఆత్మను అనుభవించగలను.
- పైకి కరుణగా కనిపిస్తున్నదంతా నీ హృదయకాంతే.
- నీ దేహకాంతి ఆత్మతళుకే.
- మనమును హృదయంతో కలిపి ఆనందరూపివైనావు.
- భగవంతుని కొలువులో వంటలవాడివై జ్ఞానాన్ని సిద్ధాన్నంగా వడ్డిస్తున్నావు.

- పశుత్వాన్ని సంహరించి, పశుపతితత్వం పెంచి హరుడికి నైవేద్యం ఇస్తున్నావు.
- నీ కళ్లలోనే వెలుగే సమస్తమైన చీకట్లను పోగొడుతుంది.
- నీ దివ్యపాద ద్వంద్వము సంసారులకు దయాద్వీపం.
- నీవు సాగించే సంశయహరణమంతా భవహరణమే.
- నీ నిరంతర మౌనంలోనేకాంతి, శక్తి, నిష్ఠ సేదతీరుతున్నయ్.
- నీ చేతులలో శక్తి, ముఖమండలంలో మహాలక్ష్మి, మాటలలో సరస్వతి కొలువు తీరి వున్నారు.
- నీకు దూరంగా వున్నట్లున్నా నీ కరుణకు పాత్రుడనైనాను.
- నీకంటే ముందే ఎందరో మహామునులు అరుణాచలంలో వున్నారు. నీవు చేరుకున్న తర్వాతే అది రమణాచలమైంది.
- అనంతశాంతి, ఘనశక్తి, అద్భుత వైరాగ్యం, గాఢకరుణ, మాయాంతకమైన జ్ఞానం, మధుర ప్రవర్తన ఆరుముఖాలుగా వెలుగొందుతున్న నీవే మానవులకు ఆదర్శమయం.